# పూర్ణాహుతి



'కృష్ణా పత్రిక' . . . ఫిబ్రవరి, 1996

ఆదివారం కదా... అని మామూలుగానే ఉదయం ఎనిమిదింటికి రామశర్మ గారింటికి బయలుదేరాను.

వారి సందులో ఒక ఇంటిముందు జనం గుమిగూడి ఉన్నారు. ఆ ప్రక్కనే రామశర్మగారిల్లు! ఆ జనాన్ని చూసి ఏమిటోనని కొంచెం ఆదుర్దాగా అటు వెళ్లాను. ఆ జనాన్ని సమీపించేసరికి అక్కడ...

"పాపం- పాల్‌శాస్త్రిగారు చనిపోయారు!" అని అనుకోవడం వినిపించింది.

'పాల్‌శాస్త్రి' అనే పేరు నాకు చాలా విచిత్రంగా అనిపించింది. అది క్రైస్తవ నామమో, హైందవ నామమో... లేక వాటి మిశ్రమమో నాకు అర్థంకాలేదు. ఆ సమస్య నాలో ఉత్సుకతను మరింత రేకెత్తించింది. అందుచేత అక్కడే మరికొంతసేపు తారట్లాడసాగాను.

ఇంటికి ముందు కాంపౌండువాల్ ఉన్నందున లోపల ఏమి జరుగుతోందో తెలియడం లేదు. నేను అపరిచితుడనవడం వల్ల లోనికి వెళ్లడానికి సంశయించాను.

ఇంతలో... ఆ ఇంట్లో నుండి రామశర్మగారు బయటకు వచ్చారు. నన్ను చూడగానే-

"నువ్వటోయ్ఁ... మా ఇంటికెళ్లి వచ్చావా?" అని అడిగాడు.

నేను- "లేదండీ... ఇటు వస్తుంటే ఇక్కడ ఎవరో పోయారని అనుకుంటుంటే ఎవరో చూద్దామని ఆగాను. ఇంతకీ... ఎవరండీ పోయింది?" అన్నాను.

శర్మగారు- "పాల్‌శాస్త్రిగారోయ్! ఈయనతో విశ్వనాథశాస్త్రిగారి వంశం అంతరించింది!" అన్నారు దీర్ఘంగా నిట్టూరుస్తూ.

ఇది నాకు మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. 'విశ్వనాథశాస్త్రి' అనే పేరు స్వచ్ఛమైన హైందవ బ్రాహ్మణుల పేరు. ఆయన కొడుకు పేరు 'పాల్‌శాస్త్రి' ఎలా అవుతుంది? ఇదంతా నాకు విచిత్రంగా అనిపించింది.

నా ముఖంలో ఆశ్చర్యాన్ని గమనించారు శర్మగారు- "పాల్‌శాస్త్రిగారిని ఎరగవేమోయ్?" అని అడిగారు చిరునవ్వు నవ్వుతూ.

"నేను ఎరుగనండీ! ఆయన పేరు వినడానికే విచిత్రంగా ఉంది. ఆయన ఇంతకీ ఎవరండీ?" అన్నాను కుతూహలంతో.

"అదంతే... ఒక విచిత్రమైన విషాదగాథ నాయనా! చెబుతాను కానీ, ఈవేళ నీకేమైనా పనిఉందా?" అని అడిగారు శర్మగారు.

"ఏముందండీ... ఖాళీయే! అలవాటు చొప్పున చదరంగం ఆడుదామని మీ ఇంటికి బయలుదేరాను. ఏమైనా పని ఉందా?" అన్నాను.

"పాల్‌శాస్త్రి పోవడమైతే పోయారు. ఇప్పుడు శవాన్ని మోసుకెళ్లడానికి మనుషులు లేరు. నేను ఒకడిని ఉన్నాననుకో! ఇంకో ఇద్దరు స్నేహితులను కూడా కబురుపంపి రప్పించాను. పోతే నాలుగో కొమ్ముకి మనిషి తక్కువయ్యాడు. నువ్వేమైనా సర్దుకోగలవా? ఏమైనా అభ్యంతరముంటే నిర్మొహమాటంగా చెప్పేయి. కాకపోతే ఇంత బ్రతుకు బ్రతికి శాస్త్రిగారిని అద్దె మనుషుల చేత మోయించడం నాకు ఇష్టంగా లేదు!" అన్నారు శర్మగారు.

నేను "దానిదేముందండీ! అవసరానికి సహాయపడడం కంటే కావలసిందేమిటి? అందులోనూ ఇటువంటి సందర్భాలలో తప్పక సహాయం చేయవలసిందే గదా... తప్పక మోస్తాను!" అన్నాను.

ఆయన- "చాలా సంతోషం నాయనా! మన బ్రాహ్మణులలో ఈ మాదిరిగా ముందుకు వచ్చేవాళ్ళు చాలా అరుదుగా ఉంటారు. బ్రాహ్మణులలో చచ్చిన వాడి చావు ఏమోగాని- ఆ శవాన్ని తగలేసేసరికి బ్రతికున్నవాళ్ళకి చచ్చినంత పనవుతుంది. ఇటువంటి అవసరం వచ్చేసరికి ప్రతివాడూ పెళ్ళాం కడుపుతో ఉందనో, తల్లిదండ్రులు బ్రతికే ఉన్నారనో... ఎక్కడలేని సాకులూ చెప్పి తప్పించుకుంటారు. ఈ దౌర్భాగ్యం నుంచి మన కులానికి ఎప్పుడు ముక్తి లభిస్తుందో?!" అన్నారు బరువుగా.

"అనాధ ప్రేత దహనాయ కోటి యజ్ఞ ఫలంలభేత్' అని మన శాస్త్రాలు ఉద్ఘోషిస్తున్నాయి కాదండీ! మరి, మనవాళ్ళు వెనక్కి తగ్గడానికి కారణం ఏమిటి?" అన్నాను నేను కుతూహలంతో.

ఆయన- "ఉన్నాయి నాయనా! మన హిందూ శాస్త్రాలలో ఉన్నవన్నీ నిత్యసత్యాలే! అయితే కాలం మార్పు వల్ల ప్రజలలో స్వార్థం పెరిగి వాటిని ఆచరించడంలో లోటు జరుగుతోంది. తమ తప్పిదాలను వాడుకునేందుకు శాస్త్రాలకు వక్రభాష్యాలు చేయడం కూడా జరుగుతోంది!" అన్నారు ఆయన ఆవేదనతో.

ఇంతలో... ఎవరో లోపలినుంచి వచ్చి, "అయ్యా శర్మగారూ... అంతా సిద్ధమయింది. ఇక శవాన్ని తీసుకువెళ్లడమే తరువాయి! తమరు లోనికి దయచేయవచ్చు!" అన్నారు.

శర్మగారు "ఆఁ... ఇదుగో వస్తున్నాను!" అని నావంక తిరిగి -

"అబ్బాయి కృష్ణా! నువ్వు మనింటికి వెళ్లి దాన్నడిగి ఓ తుండూ, అంగవస్త్రం తెచ్చుకో- అక్కడ స్నానం చేయవలసి ఉంటుంది" అన్నారు.

నేను వెళ్లబోతుంటే మళ్లీ వెనక్కి పిలిచి -

"అబ్బాయ్‌ః... ఇంతకీ నీ మెళ్లో జంధ్యం ఉందా? లేకుంటే చెప్పు... తెప్పిస్తాను" అన్నారు. నేను నవ్వుతూ "ఉందండీ..." అంటూ ముందుకి సాగాను.

"ఏమోలే... ఈరోజుల్లో బ్రాహ్మణ కుర్రవాళ్ళకి గాయత్రి జపించకపోతే పీడాపోయే- జంధ్యం మెళ్లో వేసుకోడానిక్కూడా నామోషే!" అంటున్న శర్మగారి మాటలు వెనకనుంచి వినవస్తున్నాయి.

నేను శర్మగారింట్లో బట్టలు తెచ్చుకుని తిరిగివచ్చాను. నలుగురమూ పాల్‌శాస్త్రిగారి శవాన్ని మోసుకుని వీధిలోకి వచ్చాం. నేనూ, శర్మగారూ ముందుకొమ్ములు పుచ్చుకున్నాం. నిద్రపోతున్నట్లున్న శాస్త్రిగారి ప్రశాంతవదనం చూస్తుంటే... నాకే ఆయనపై ఎనలేని భక్తి భావం కలిగింది.

శవం వెంట దగ్గర దగ్గర వందమంది దాకా జనం రాసాగారు. వాళ్ళని చూసేసరికి 'శాస్త్రిగారు ఎంతటి పేరున్నవారో..!' అని అనిపించింది నాకు. శాస్త్రిగారు ఎవరో, ఏమిటో, వారు ఏ రంగంలో ప్రఖ్యాతి వహించారో తెలుసుకోవాలనే ఉత్సాహం నాలో హెచ్చసాగింది.

ఆ ఆలోచనలతో నడుస్తున్న నన్ను శర్మగారు- "చూశావటోయ్! గట్టిగా రెండు వీధులైనా దాటామో, లేదో... అప్పుడే జనమంతా ఎల్లా సర్దుకున్నారో! పాల్‌శాస్త్రిగారు ఒకప్పుడు ప్రసిద్ధ రచయిత. అందుకే చివరికి దిక్కులేని చావు చచ్చాడు. ఈ జనం అంతా ఉన్నారు చూశావ్! వీళ్ళంతా ఆయన మీద అభిమానం కొద్దీ వచ్చారను కుంటున్నావా? అదేం లేదోయ్‌ః... ఇంతమందిలో ఆయన శవాన్ని మోయడానికి ఒక్కడు ముందుకు వస్తే ఒట్టు! వీళ్ళు ప్రపంచంలో ఉన్న సానుభూతంతా తమ భుజాల మీదే ఉన్నట్లు ఫోజులు వేస్తూ, అక్కడ కాసేపు హడావుడిగా తిరిగి, ఏవో సభలుపెట్టి ఎన్నో సంతాప తీర్మానాలు చేస్తారు. ఆయన స్మారకచిహ్నంగా ఏవో శిలావిగ్రహాలనీ, గ్రంథాలయాలనీ, ఇంకేదో వాళ్ళ శ్రాద్ధమనీ ఉపన్యాసాలు దంచుతారు.

అందుకు ఒక కమిటీని కూడా వేస్తారు. అక్కడితో ఆఖరు! వాళ్ళు చెప్పినవన్నీ వేదిక దిగివచ్చేసరికే మరిచిపోతారు. అయితే వాళ్ళ పేర్లు పేపర్లలో పడేటట్లు మాత్రం శ్రద్ధగా చూసుకుంటారు. అంతటితో ఆ వ్యక్తి స్మృతులకు కూడా సమాధి కట్టేస్తారు. అందుకే అన్నాడు మహాకవి- 'మనవాళ్ళు వట్టి వెధవాయలోయ్' అని!" అన్న ఆవేశపూరితమైన మాటలు నన్ను తిరిగి ఈ లోకంలోకి తీసుకువచ్చాయి.

ఎప్పుడూ లేనిది శర్మగారిలో అంతటి ఆవేశం చూసేసరికి- నాకు చాలా ఆశ్చర్యం వేసింది. వెనక్కు తిరిగి చూశాను. శవం వెనుక గట్టిగా పదిమంది కూడా లేరు. నాకు

ఆశ్చర్యం వేసింది. నేను ఈ ఊరికి ఉద్యోగరీత్యా వచ్చి నాలుగు నెలలు కావస్తోంది. బ్రహ్మచారిని కనుక విడిగా ఒక గదిలో ఉంటున్నాను. రామశర్మగారూ, మా నాన్నగారూ బాల్యస్నేహితులు. శర్మగారు తరచూ మా ఊరు వస్తుండేవారు. అందువల్ల ఆయన నాకు బాగా తెలుసు. నేను ఈ ఊరికి బదిలీ అవగానే, నన్ను వారింట్లోనే ఉండిపొమ్మని ఆయన చాలా బలవంతపెట్టారు. కాని, నాకే ఇష్టంలేక విడిగా ఉంటున్నాను.

కాని, తరచూ ఆయన్ని కలుసుకుంటుండేవాడిని.

ఆపైన వయస్సులో మా ఇద్దరికీ చాలా వ్యత్యాసం ఉన్నా- మా ఇద్దరి మధ్యా ఒక విధమైన స్నేహం కూడా ఉండేది. అది ఏమిటంటే ఇద్దరికీ కూడా చదరంగం అంటే విపరీతమైన పిచ్చి! ప్రతి ఆదివారం విధిగా ఉదయం ఎనిమిది నుండి శర్మగారింట్లోనే ఆడేవాళ్ళం. ఆరోజు భోజనం కూడా వారింట్లోనే చేస్తుంటాను. సాయంత్రం వరకూ చదరంగం ఆడుతూనే ఉండేవాళ్ళం.

నేను చదరంగం బాగా ఆడుతాననే పేరు ఉంది. అటువంటి నాకు స్టేట్ ఛెస్‌ప్లేయరైన రామశర్మగారితో ఆడడమంటే ఎంతో సంతోషంగా ఉండేది. ఆయన అద్భుతమైన ఎత్తులు వేసేవారు. ఆటకట్టు అనుకునే సమయంలో విచిత్రంగా ఒక ఎత్తు వేసి మన ఆట కట్టించేవారు. ఆయన దగ్గర నేర్చుకున్న ఎత్తులతో నేను అప్పుడప్పుడు ఆయన ఆటనే కట్టిస్తుండేవాడిని. అటువంటి సందర్భంలో ఆయన ఆనందం పట్టలేక నా భుజం తట్టి, "శభాష్..!" అనేవారు. మావాళ్ళు ఎవరూ లేని ఆ ఊళ్ళో ఆయన్ని చూస్తుంటే నాకు మా నాన్నగారిని చూసినట్టుండేది.

ఇంతకీ ఈ శాస్త్రిగారు ఎవరో నాకు అర్థంకాలేదు. ఆ పేరు నేను ఎప్పుడూ వినికూడా ఉండలేదు. నాకు సాహిత్యంలో అభినివేశం ఉంది. కాని, ఆ పేరు ఎక్కడా వినికూడా ఉండలేదు. ఎప్పుడైనా వినివున్నా, కనీసం ఎక్కడైనా చూసివున్నా, ఆ పేరులోనున్న విచిత్రం వల్లనైనా నాకు జ్ఞాపకం ఉండివుండేది. మరి శర్మగారేమో- ఆయన పెద్ద రచయితంటున్నారు. 'ఆయన ఎవరు చెప్మా..?' అని తీవ్రంగా ఆలోచిస్తున్నాను.

"స్మశానానికి వచ్చేశామోయ్ఁ..." అన్న శర్మగారి మాటల్తో నా ఆలోచనల్లో అంతరాయం కలిగింది.

పాడెని క్రిందకు దింపాము.

వెనక్కి తిరిగి చూశాను... ఇందాకటి పదిమంది కూడా ఎప్పుడు జారుకున్నారో- జారుకున్నారు. శవం వెంట ఉన్నది కేవలం మోసిన మా నలుగురమూ- తప్పనిసరిగా

ఖర్మ చేయవలసి వచ్చిన శాస్త్రిగారి బహుదూరపు బంధువూ- కర్మ చేయించే బ్రాహ్మణుడూ- కట్టెలూ, కిరసనాయిలూ తెచ్చిపెట్టినవాడూ- అంతా కలిసి ఏడుగురం!

శాస్త్రిగారి శవం తగులబడుతోంది. శాస్త్రిగారి బంధువూ, కర్మ చేయించే బ్రాహ్మణుడూ ఓ మూల కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు. వాహకులలో మిగిలిన ఇద్దరికీ ఏవో దెయ్యాల కథలు చెబుతున్నాడు వెట్టివాడు.

నేనూ, శర్మగారూ దగ్గర్లో ఉన్న రావిచెట్టు క్రింద కూర్చున్నాం. చల్లగాలి వీస్తుంటే ప్రాణం లేచివస్తోంది.

"ఇంతకీ... ఈ పాల్‌శాస్త్రిగారు ఎవరండీ?" అన్నాను నేను- అంతవరకూ బలవంతాన ఆపుకున్న కుతూహలాన్నీ ఇంక ఆపుకోలేక.

"నీకు తెలీదులేవోయ్! ఆయన పేరు వినిపించే రోజుల్లో నీవు పుట్టికూడా ఉండవు. ఆయనను గురించి చెప్పేముందు- ఆయన తండ్రి విశ్వనాథశాస్త్రిగారి విషాదగాథ చెప్పవలసి ఉంది...

అవి ఈ శతాబ్దపు తొలిసంవత్సరాలు!

ఏడవ అడ్వర్డు రాజు హయాంలో బ్రిటిష్ ప్రభుత్వం మన దేశాన్ని పాలిస్తున్న రోజులు! సిపాయిల తిరుగుబాటు అణచివేయబడిన తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం మన దేశంలో సుస్థిరంగా వ్రేళ్లు పాతుకోడానికి కొన్ని ముఖ్యమైన పథకాలు వేసింది. అందులో ముఖ్యమైనది... భారత దేశంలో క్రైస్తవ మతవ్యాప్తి గావించడం! రెండవది... విధిగా పాఠశాలల్లో ఇంగ్లీషును బోధించడం! క్రైస్తవ మతవ్యాప్తికి మిషనరీలు ముఖ్యంగా అస్పృశ్యులను చేరదీశారు. వారికి ఉచితంగా వైద్య సదుపాయం, ధన సహాయం మొదలైనవి చేయసాగారు. వారి పిల్లలకు ఉచిత విద్యా సదుపాయాలు, ఉచిత భోజన వసతులు కల్పించసాగారు. అంతవరకు మనుషులుగా పుట్టినా, పశువుల కన్నా హీనంగా చూడబడిన అశ్పృశ్య జాతులకు క్రైస్తవ మిషనరీలు సాక్షాత్తూ దివి నుంచి భువి కేతెంచిన పరదైవతాల వలె గోచరించారు. వారు ముమ్మరంగా క్రైస్తవులుగా మారిపోజొచ్చారు.

అయితే... క్రైస్తవ మిషనరీల లక్ష్యం విద్యావిహీనులైన ఈ అస్పృశ్యులకు క్రైస్తవం ఇప్పించడం మాత్రమే కాదు- అది అతి సులువుగా జరిగేటటువంటిది. భారతదేశం తూర్పు ఖండానికంతటికీ హృదయం వంటిది. అక్కడి ప్రజలు అనాది నుండీ వ్రేళ్లు పాతుకున్న హిందూధర్మానికి చెందినవారు. వారు మహా విశిష్ట లక్షణాలు కలిగినట్టివారు. సకల ధర్మాలనూ, తత్వాలనూ కరతలామలకంగా తెలియజెప్పి ఎటువంటి వారినైనా

హైందవ ధర్మం వైపుకు త్రిప్పుకోగల మహా పండితులు, సన్యాసులు, అసంఖ్యాకంగా ఉన్న పవిత్రదేశం అది!

వారు కనుక తలుచుకుంటే- ఎన్ని కోట్లమంది ప్రజలు క్రైస్తవులుగా మారిపోయినా... విజయశంఖం పూరించి తిరిగి అందర్నీ హైందవులుగా మార్చగల శక్తిమంతులు! కనుక ఇట్టి ప్రమాదాన్ని ఆపి, భారతదేశాన్ని క్రైస్తవదేశంగా మార్చాలంటే దానికి ఒక్కటే మార్గం... మతం మార్పిడి! ముఖ్యంగా అగ్రవర్ణాలలో జరగాలి.

అందులోనూ బ్రాహ్మణులు పూర్వకాలంలోను, ప్రస్తుత కాలంలోను కూడా ఎక్కువగా చదువుకున్నవారు. ముఖ్యమైన పదవులలోను, ఉద్యోగాలలోను ఉన్నట్టివారు. ఆరోజుల్లో ఇంకా బ్రాహ్మణులంటే-ప్రతి వర్ణం వారికి అత్యంత గౌరవ ప్రపత్తులు ఉండేవి. బ్రాహ్మణులు జాతికి, సంఘానికి మార్గదర్శకులుగా ఉండేవారు. కనుక అట్టి బ్రాహ్మణులలో ఎంత ఎక్కువ మందిని క్రైస్తవులుగా మార్చగలిగితే... అంత త్వరితంగా క్రైస్తవం భారతదేశంలో వ్యాపిస్తుంది. భారతదేశమే కనుక క్రైస్తవమయిందంటే- ఆ దేశం నుంచే పుట్టిన బౌద్ధమతాన్ని అవలంబించే చైనా, జపాను వంటి దేశాలు కూడా భారతదేశాన్ని అనుసరించి క్రైస్తవంగా మారిపోయి, మొత్తం మార్పు జరిగి ఖండమే క్రైస్తవభూయిష్ట మవుతుంది. ప్రపంచంలో అత్యధికులు బౌద్ధులు. అట్టి బౌద్ధులు కూడా క్రైస్తవులైతే క్రైస్తవం ఈవల ప్రపంచాన్నీ ఏకచ్ఛత్రంగా ఏలగలదు.

కనుక సామదానభేదదండోపాయాలలో దేనినుపయోగించైనా బ్రాహ్మణులను క్రైస్తవులుగా మార్చమని ప్రత్యేకమైన ఆదేశాలుండేవి మిషనరీలకు. బ్రాహ్మణులు కనుక క్రైస్తవులుగా మారితే, 'సర్వశాస్త్ర పారంగతులు, సంఘానికి మార్గదర్శకులు అయినవారే మారితే మేమెంత? మేమూ వారితోనే!' అంటూ ఇతర వర్ణాలవారు కూడా, అతిత్వరగా క్రైస్తవం పుచ్చుకుంటారు కనుక క్రైస్తవ మిషనరీలు- ఒక బ్రాహ్మణుడు కనుక క్రైస్తవుడుగా మారితే, కొన్నివేల మంది అస్పృశ్యులూ, తక్కువ జాతులవారు క్రైస్తవులుగా మారిన దానికంటే ఎక్కువగా ఆనందపడేవారు. అందువల్ల వారు బ్రాహ్మణులకి ఎన్నెన్నో ఆశలు చూపించేవారు.

అయినప్పటికీ ఎన్ని ఇబ్బందులు పడుతున్నా- బ్రాహ్మణులు మాత్రం ఎక్కడో అరుదుగా తప్ప క్రైస్తవం పుచ్చుకునేవారు కారు. అయినప్పటికీ మిషనరీలు మాత్రం, చాలా ఓర్పుతో ఏ విధంగానైనా వారిని మార్చాలనే దీక్షలో ఉండేవారు.

ఇవీ ఆనాటి పరిస్థితులు... ఇంక అసలు కథకి వస్తాను-

ఈ ఊళ్లో విశ్వనాథశాస్త్రిగారని శుద్ధశోత్రియ కుటుంబానికి చెందిన బ్రాహ్మణుడు ఉండేవారు. ఆయన తండ్రి, తాతలు మహానిష్ఠాతులు. యజ్ఞం చేసినవారు. విశ్వనాథశాస్త్రుల వారు వేదం చదువుకున్నవారు. తర్కమీమాంస శాస్త్రాలలో దిట్టలని పేరుపొందారు. సంస్కృతాంధ్రాలలో విశేషమైన ప్రజ్ఞాపాటవాన్ని సంపాదించి ఉభయ భాషా ప్రవీణులయ్యారు.

ఆరోజుల్లో ఎప్పుడైతే ఇంగ్లీషు విద్యావిధానం అమలులోకి వచ్చిందో, ఎప్పుడైతే పాఠశాలలో ఇంగ్లీషు బోధనా భాష అయ్యిందో, సంస్కృతాంధ్ర పండితులకు ఉద్యోగాలు లభించడం దుర్లభమయింది. విశ్వనాథశాస్త్రిగారికి అతికష్టం మీద ఈ ఊళ్లోనే మిషన్ హైస్కూల్లో తెలుగు పండితుడుగా ఉద్యోగం దొరికింది. ఆరోజుల్లో ఇంగ్లీషు ఉపాధ్యాయులూ సాధారణంగా ఆంగ్లేయులనే వేసేవారు. వారికి మిగిలిన ఉపాధ్యాయుల కంటే జీతం, సౌకర్యాలు ఎక్కువగా ఉండేవి. మిగిలిన ఉపాధ్యాయుల కన్నా తెలుగు ఉపాధ్యాయులకు జీతం తక్కువగా ఉండేది. వాళ్ళంటే విద్యార్థులకూ, అధికార్లకూ కూడా లోకువగానే ఉండేది. కానీ, పొట్టకూటి కోసం ఎన్నో అవమానాలు భరిస్తూ ఉద్యోగం చేస్తుండేవారు తెలుగు ఉపాధ్యాయులు.

ఆ విధంగా ఎనిమిది సంవత్సరాలు గడిచింది. శాస్త్రిగారు వివాహితులయ్యారు. ఇద్దరబ్బాయిలు, ఒక అమ్మాయికి తండ్రి అయ్యారు.

రోజులు అలా గడుస్తుండగా మిషన్ హైస్కూల్ అధికారులు ఒక నిబంధన ప్రవేశపెట్టారు. తెలుగు టీచర్లు కూడా మూడు సంవత్సరాలలోగా మెట్రిక్ స్థాయికి చెందిన ఇంగ్లీషును నేర్వాలనీ, అందులో పరీక్షలు నడుపుతారనీ, అది ప్యాస్ కాకపోతే స్కూల్లో ఉద్యోగం చేయడానికి అర్హత ఉండదని దాని సారాంశం! ఆ వయస్సులో శాస్త్రిగారికి కొత్తగా చదువుకోవడం కష్టమైనదైనా, పట్టుదలతో స్వయంకృషితో రెండు సంవత్సరాలలోనే ఆ అర్హతను సంపాదించారు.

ప్రిన్సిపాల్‌గారు స్వయంగా శాస్త్రిగారిని పిలిపించాడు. ఆరోజుల్లో హైస్కూళ్లకు కూడా ప్రిన్సిపాల్స్ ఉండేవారు. ఆ పదవులలో ఎప్పుడూ తెల్లవాళ్ళే ఉండేవారు. ప్రిన్సిపాల్ పదవిలో ఉన్నవాడు 'జాన్సన్' అనే ఆంగ్లేయుడు.

తెల్లని ఛాయతో, అంతకుమించిన తెల్లని విభూతిరేఖలు ముఖంమీద కలిగి, వాటిమధ్య శంకరుని త్రినేత్రం వలె ధగధగలాడే ఎర్రని కుంకుమబొట్టు కలిగి, నిగనిగ మెరిసే నున్నటి గుండుమీద నిగనిగలాడే నల్లని పిలకజుట్టుతో, తెల్లని పంచె, అంగరఖా,

ఆపైన జరీఅంచు ఉత్తరీయంతో తళతళ మెరిసిపోతూ తన గదిలోకి అడుగుపెట్టిన శాస్త్రిగారిని చూసి విస్మయం చెందాడు జాన్సన్.

తాను క్రొత్తగా పదవీ స్వీకారం చేసినందున- ఆ శాస్త్రిగారితో ఎక్కువ ఏమిటీ... ఇంచుమించు పరిచయం లేదు. నలుగురితోపాటు ఆయన్నీ చూసినా, ఆయన ముఖం ప్రత్యేకించి జ్ఞాపకం లేదు. ఆయన యొక్క వేషాలంకారాలు, ఆంగ్లేయుల దృష్టిలో ఆటవికమైనవైనా, ఆయన ముఖంలో గోచరించే దివ్యతేజస్సు చేత ఆకర్షింపబడ్డాడు. ఆయన అగ్రజాతి హిందువులకే మార్గదర్శకుడుగా అనిపించాడు.

ఆయన్ని చూసేసరికి జాన్సన్ మస్తిష్కంలో ఒక ఆలోచన మెరిసింది... 'ఏ విధంగానైనా ఇటువంటి శాస్త్రిగారిని క్రైస్తవునిగా మార్చగలిగితే- ఆయన్ననుసరించి అనేకమంది అగ్రవర్ణాలవారు క్రైస్తవులుగా మారుతారు. మిషనరీల యొక్క లక్షణం సులువుగా సిద్ధిస్తుంది' అని!

శాస్త్రిగారు ప్రిన్సిపాల్‌గారి గదిలో అడుగు పెడుతూనే భారతీయ సాంప్రదాయం ప్రకారం నమస్కరించారు. జాన్సన్ ప్రత్యభివందనం చేసి, తన ఎదురుగానున్న కుర్చీలో కూర్చోమన్నారు.

శాస్త్రిగారు కూర్చున్నాక జాన్సన్- అంత స్వల్పకాలంలో శాస్త్రిగారు మెట్రిక్ స్థాయి ఇంగ్లీషును నేర్చి పరీక్ష పాసవడం ఎంతైనా అభినందించదగ్గ విషయమనీ, అది తమ స్కూల్‌కే గర్వకారణమనీ ప్రశంసించారు. శాస్త్రిగారు సవినయంగా అదంతా వారి ఆశీస్సులన్నారు.

జాన్సన్ శాస్త్రిగారి కృషిని మెచ్చి, ఆయనకోసం ప్రత్యేకంగా స్కూల్ నియమాలను ఉల్లంఘించి, ఆయనకు తెలుగు పండితుల స్కేల్ నుండి ఇతర ఉపాధ్యాయుల స్కేలులో అనుగుణంగా జీతం పెంచదలచినట్లు చెప్పారు. శాస్త్రిగారు ఆనందంతో పారవశ్యం చెందారు.

జాన్సన్ పథకం ఫలిస్తోంది.

8ఆయన కనుక కృషిచేసి బి.ఏ. పాసయితే సాధారణంగా ఆంగ్లేయులకే తప్ప భారతీయులకి లభ్యంకాని ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా ప్రమోట్ చేస్తాననీ, అందుకు కృషి చేయమనీ సలహా ఇచ్చారు. శాస్త్రిగారు ఆనందంతో 'సరే...' నన్నారు.

అప్పటినుంచి శాస్త్రిగారు ఎంతో కృషిచేసి బి.ఏ.ను చదవసాగారు. ఈలోగా ఆయనకు మూడోకొడుకు పుట్టాడు. వానికి 'చంద్రపాలశాస్త్రి' అని పేరుపెట్టారు శాస్త్రిగారు.

జాన్సన్ తరచూ శాస్త్రిగారిని పిలిపించి ప్రోత్సహిస్తూ ఉండేవాడు. ఒకసారి ఆయనకు బైబిల్ గ్రంథం ఇచ్చి దాన్ని క్షుణ్ణంగా చదివి, హిందూ క్రైస్తవ మతసామ్యాన్ని పరిశోధించమని సలహా ఇచ్చాడు.

శాస్త్రిగారు శ్రద్ధగా బైబిల్ పఠించడం మొదలుపెట్టారు. జాన్సన్ అవకాశం ఉన్నప్పుడల్లా ఆయనని క్రైస్తవ మిషనరీల ఉపన్యాసాలకు తీసుకువెళ్తుండేవాడు. పరమత ద్వేషం ఎరుగని హిందూమతంలో పుట్టిన శాస్త్రిగారికి అందులో తప్పిదమేమీ కనిపించింది కాదు.

జాన్సన్ శాస్త్రిగారికి ఎన్నెన్నో ఆశలు చూపిస్తూ ఉండేవాడు. శాస్త్రిగారి బి.ఏ. అయిపోగానే ఆయనను ఇంగ్లీషు ప్రొఫెసరుగా రికమెండు చేసి ప్రమోట్ చేయిస్తాననీ, దాంతో ఆయనకి ఆంగ్లేయులకున్న హోదా లభిస్తుందనీ ఊరించేవాడు. ఆంగ్లేయుల పిల్లలకు ఉచితంగా విదేశాలలో పైచదువులు చెప్పిస్తారనీ, శాస్త్రిగారి పిల్లలకు కూడా అదేవిధంగా ఇంగ్లండ్‌లో 'బార్-ఎట్-లా' వంటి చదువులు చెప్పిస్తాననేవాడు. శాస్త్రిగారి వంటి ప్రతిభావంతునికి పుట్టిన పిల్లలు సహజంగా ప్రతిభావంతులు అయివుంటారనీ, వాళ్ళని కలెక్టర్లుగానూ, జడ్జీలుగానూ చేయిస్తాననీ చెపుతుండేవాడు. అవన్నీ విని శాస్త్రిగారు గాలిలో మేడలు కట్టుకుంటుండేవాడు.

శాస్త్రిగారికి బి.ఏ. పూర్తయింది. ఆయనను అభినందించడానికి జాన్సన్ బ్రహ్మాండమైన పార్టీ ఏర్పాటుచేసి, అందరి ఎదుటా ఆయన్ని ఎంతో పొగిడాడు. శాస్త్రిగారి మనస్సు ఆనందంతో ఎగిరి గంతులు వేసింది.

ఆఁ... చెప్పడం మరిచాను- నేను శాస్త్రిగారి వద్దనే చదువుకున్నాను. నేనంటే ఆయనకి ఎంతో అభిమానం ఉండేది. నాకూ ఆయన పట్ల విశేష భక్తిప్రపత్తులూ ఉండేవి. పైగా ఆయన పట్టి భోళామనిషి... ఏదీ దాచుకోలేరు. అందువల్లే ప్రతి చిన్నవిషయం నాతో చెబుతుండేవారు. కనుకనే నాకు ఆయన విషయాలు బాగా తెలుసు.

సరే... పాపం- శాస్త్రిగారు తనకి ఇంగ్లీషు ప్రొఫెసర్ ప్రమోషన్ అతిత్వరలో వస్తుందని ఆశపడి, 'ఎప్పుడెప్పుడా...' అని ఎదురుచూడసాగారు.

ఆరోజు జాన్సన్ శాస్త్రిగారిని తన రూమ్‌కి రమ్మని కబురుపెట్టాడు. బహుశా... ప్రమోషన్ విషయమైయ్యుంటుందని సంతోషంతో వెళ్లారు శాస్త్రిగారు."

- శర్మగారు దీర్ఘంగా నిట్టూర్చి ఆగారు. చితివంక చూశారు. శవం ఇంకా తగులబడుతూనే ఉంది. వెట్టివాడు మళ్లీ పుల్లలు వేసి నిప్పును ఎగద్రోశాడు. గాలి తిరిగింది.

మంటలు జజ్వలంగా మండసాగాయి. పాల్‌శాస్త్రిగారి శవాన్ని అగ్నిహోత్రుడు త్వరితంగా ఆహుతి చేసుకుంటున్నాడు.

శర్మగారు తిరిగి చెప్పడం ప్రారంభించారు -

"జాన్సన్ పథకం చరమదశ నందుకుంటోంది. ఆయన శాస్త్రిగారితో 'వెరీ సారీ శాస్త్రిగారూ! ఈవేళ మాకు లండన్ నుంచి స్పెషల్ ఇన్‌స్ట్రక్షన్సు వచ్చాయి. క్రైస్తవులు కాని వారికి మన మిషన్‌స్కూల్లో ఉద్యోగాలు ఇవ్వరాదనీ, ఉన్నవాళ్ళకి నోటీసులు ఇచ్చి ఉద్యోగాలు తొలగించమనీ ఆదేశాలు వచ్చాయి. నాకు చాలా బాధగా ఉంది. అయినా నేనేం చేయను చెప్పండి? నేను మీలాంటి జీతానికి కుదిరిన ఉద్యోగినే కదా?' అన్నాడు దీనంగా ముఖం పెట్టి.

శాస్త్రిగారి నెత్తిన పిడుగు పడినట్టయింది. తాను కూర్చున్న చోటు నుంచి అధః పాతాళంలోకి కృంగిపోతున్నట్లనిపించింది. నోట మాట రాలేదు. కొంతసేపటికి తెప్పరిల్లి-

"అయితే ఏమిటి కర్తవ్యం చెప్పండి? ఇన్నేళ్ల సర్వీసును వదులుకుని ఇంటికి పోవలసిందేనా? ఈ వయస్సులో మళ్లీ నాకెవరు ఉద్యోగం ఇస్తారు?" అని గోడుగోడున వాపోయారు శాస్త్రిగారు.

జాన్సన్ "దిగులుపడకండి శాస్త్రిగారూ! మీ శ్రేయోభిలాషిగా నేను మీకు ఒక సలహా చెప్తాను. మీరు బాగా ఆలోచించుకుని మీకు నచ్చినట్లయితేనే ఆచరించండి. మీరు ఇంత సర్వీసు పెట్టుకుని, అన్యాయంగా వెళ్లిపోవడం ఏమీ బాగాలేదు. మీరన్నట్లు మీకు ఈ వయస్సులో ఉద్యోగం కూడా ఎక్కడా దొరకదు. మీ గురించి నేను కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్సులో చాలా మంచి రిమార్కులు వ్రాశాను. నేడో రేపో మీకు ఇంగ్లీషు ప్రొఫెసర్ ఉద్యోగం రాబోతుంది. అంతేకాదు, నేను మరొక్క మూడేళ్లలో రిటైరయిపోతాను. మీ గురించి స్పెషల్‌గా రికమెండు చేయదలిచాను. మీకు అప్పుడు ప్రిన్సిపాల్ పదవి లభిస్తుంది. దీన్ని ఇంతవరకు మేము ఏ భారతీయునికీ ఇయ్యలేదు. మీ పిల్లలకు విదేశాలలో ఉచితంగా ఉన్నత విద్య లభిస్తుంది. ఇవన్నీ పొందడానికి మీకు అడ్డుగా ఉన్నది కేవలం మీ మతం! మీరు కనుక క్రైస్తవ మతం పుచ్చుకుంటే ఈ సమస్యలేవీ ఉండవు. ఏ మతమైతే ఏమిటి? మీ మతంలో చెప్పినవన్నీ మా మతంలో లేవూ? మా మతంలో చెప్పినవి మీ మతంలో లేవా? అయినా వాళ్ళ తృప్తికోసం మతాన్నీ, వేషాన్నీ మార్చుకుంటే సరిపోయె! మనస్సులో మాత్రం మీ మతం పైనే గురి ఉంచుకోండి మిమ్మల్ని ఎవరడగ వచ్చారు? ఈ కాస్త దానికోసం మీరు మీకు కలుగబోయే సదుపాయాలన్నీ వదులుకుని, కష్టాలకు గురి

అవుతారా? బాగా ఆలోచించుకోండి... నేను చెప్పినది న్యాయమనే మీకు అనిపిస్తుంది!" అన్నాడు నేర్పుగా.

అంతకుముందు పడిన పిడుగుతోనే ఉక్కిరిబిక్కిరి అవుతున్న శాస్త్రిగారి మనస్సులో బ్రహ్మాండం బ్రద్ధలయింది. ఏమిటీ ఘోరం! తన ఉద్యోగానికీ, మతానికీ ఏమిటీ లంకె? కాని, ఇప్పుడున్న దేశకాల పరిస్థితులలో జాన్సన్ సహేతుకంగానే చెప్పినట్లనిపించింది. ఏమీ తోచలేదు. చివరికి "నన్ను ఆలోచించుకోనీయండి సార్..." అంటూ బయటకు వచ్చేశారు.

ఆ రోజంతా ఆయనకి మనస్సు మనసులో లేదు. తిండి నోటికి ఎక్కలేదు. ఎంత ఆలోచించినా తన కర్తవ్యం గోచరించలేదు. తన బిడ్డలు ఇద్దరూ వరుసగా, ఎఫ్.ఎ. మెట్రిక్ చదువుకుంటున్నారు. తర్వాత అమ్మాయి కట్టి తప్పిపోతోంది. ఆ అమ్మాయి పెళ్ళికోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. బందరు సంబంధం స్థిరపడినట్లే. చివరివాడు చంద్రపాల శాస్త్రి థర్డుఫారం చదువుచున్నాడు. వీళ్ళు కాక తను పోషించవలసిన ముసలి తల్లి, భార్యా ఉన్నారు. తన ఉద్యోగం పోతే వీళ్ళందరి గతీ ఏమి కాను? తానేమీ ఆస్థిపరుడు కాదు. తన సంపాదనతోనూ, స్కూల్ వాళ్ళు ఇచ్చిన స్కాలర్‌షిప్పుల తోనూ, ఎలాగో పిల్లలకు గుట్టుగా చదువు చెప్పిస్తూ సంసారం నెట్టుకువస్తున్నాడు.

జాన్సన్ మాటలు జ్ఞాపకానికొచ్చాయి. పాపం... ఆయనకి తనంటే ఎందుకో అంత అభిమానం? తన మంచి కోసమేగా ఆయన తనకా సలహా ఇచ్చింది? ఆయనన్నట్లు ఏ మతమైతే నేమీ? ఇతర మతాలను ద్వేషించకుండా ఉంటే చాలదా? పైకి ఎలా ఉంటేనేమి– తన మనస్సులో హిందూ ధర్మానికే స్థానం ఉంటుంది.

మరునాడే జాన్సన్‌కు తన నిర్ణయం తెలియజేశారు శాస్త్రిగారు. ఎగిరి గంతేసినంత పనిచేశాడు జాన్సన్. తన పథకం పారినందుకు ఆయన ముఖం ఆనందంతో పరవళ్ళు త్రొక్కుతోంది.

"నాకు తెలుసు శాస్త్రిగారూ... మీరు సమయస్ఫూర్తి గలవారు. మీలాగా కాలానికి అనుకూలంగా వ్యవహరించే వారికి ఎప్పటికీ విజయమే శాస్త్రిగారూ! ఒకవేళ మీరు ఉద్యోగమే వదులుకుంటారేమో– మీలాంటి ఉత్తమ ఉపాధ్యాయుడు లేకపోవడం మా హైస్కూల్‌కే లోటు అని చాలా బాధపడ్డాను, భయపడ్డాను. థ్యాంక్‌గాడ్... మీ సముచిత నిర్ణయానికి మిమ్మల్ని అభినందిస్తున్నాను. రేపు ఆదివారమే మీకు బాప్టిజమ్ ఇప్పించే ఏర్పాట్లు చేస్తాను. విష్‌యూ సక్సెస్!" అన్నాడు.

ఆ మరుసటి ఆదివారం నాడే శాస్త్రిగారికి బాప్టిజం ఇయ్యబడింది.

అన్నింటికీ ఆయన యాంత్రికంగా తలవొగ్గాడు. చిన్ననాటినుంచి ఉన్న తన పిలకని తీసివేస్తుంటే ఆయనకి కళ్ళనీళ్లు తిరగాయి. ఆయన క్రైస్తవుడయిన సందర్భంలో జాన్సన్ ఆయనకు రెండు జతల షర్టులు, ప్యాంట్లు బహూకరించాడు.

కంటికి ప్యాంటు షర్టులతోనూ, పిలక లేకుండానూ వచ్చిన విశ్వనాథశాస్త్రిగారిని చూసి ముందు ఆయన భార్యే గుర్తుపట్టలేదు. ఓ పట్టాన అంతా ఆశ్చర్యపోయారు.

"ఏమిటి సంగతి?" అని గుచ్చిగుచ్చి అడిగి, ఆయన 'కిరస్తానం' పుచ్చుకున్నాడని తెలుసుకుని గొల్లుమన్నారు.

"రోజూ బైబిల్ చదువుతుంటే ఏమో అనుకున్నాను కాని, ఇంతపని చేస్తావని అనుకోలేదురా చిట్టీ!" అంటూ ఏడ్చింది తల్లి.

"ఎంత పని చేశారండీ! మీకు ఇటువంటి బద్ధి ఎట్లా పుట్టింది? కనీసం మాట మాత్రమైనా చెప్పారా?" అంటూ గొల్లుమంది అర్ధాంగి.

"వాళ్ళ మతంలో ఉన్న, మన మతంలో లేని ఏ గొప్ప చూసి ఇంతపని చేశావు నాన్నా?" అన్నారు పిల్లలు బాధపడుతూ.

తనకు కలిగిన ఇరకాటపు పరిస్థితి చెప్పుకున్నారు శాస్త్రిగారు.

"అందరూ బ్రతకటం లేదట్రా? అందరూ నీలాగే మతం మార్చుకునే బ్రతుకుతున్నారా?" అంది తల్లి.

"అటువంటి దిక్కుమాలిన ఉద్యోగం మానివేస్తే ఏమండీ? పదిమంది పిల్లలకు ట్యూషన్లు చెపుతూవుంటే మన కడుపు నిండకపోతుందా?" అంది భార్య బాధగా.

"ఆఁ... కూచుని కబుర్లు చెప్పడానికేమి? కష్టపడి పనిచేసి సంపాదించేవాడికి తెలుస్తుంది ఆ బాధ! అయినా నా కొడుకులు కూడా నాలాగే బడిపంతుళ్ళవ్వాలని నేను కోరుకోవడం లేదు. వాళ్ళు కలెక్టర్లూ, జడ్జీలూ అవ్వాలి!" అంటూ రుసరుసలాడుతూ బయటకు వెళ్లిపోయారు శాస్త్రిగారు- తిండైనా తినకుండా.

ఇంక ఆనాటికి ఎవరూ ఇంట్లో భోజనం చేయలేదు.

శాస్త్రిగారు కిరస్తానం పుచ్చుకున్నారనే వార్త ఊరంతా గుప్పుమని పాక్కింది.

వాళ్ళూ, వీళ్ళూ వచ్చి ఆయన్నీ, ఇంట్లో అందర్నీ కాకులను పొడిచినట్లు పొడవసాగారు.

ఆయన భార్య చెరువుకి నీళ్లకి వెళితే అక్కడివాళ్ళు నీళ్లు ముట్టుకోనియ్యలేదు.

పిల్లలను స్కూళ్లలో మిగతా పిల్లలు- మైల వచ్చినట్లుగా దూరంగా ఉంచసాగారు. కూతురుకి కుదరబోయిన సంబంధం వెనక్కి వెళ్లింది. నిజానికి ఆ వాడకట్టంతా ఆ సంసారాన్ని వెలివేసింది.

వాళ్ళు ఎటువంటి బాధలు పడివుంటారో నీవు ఊహించుకోగలవు కనుక నేనేమీ చెప్పనక్కరలేదు.

ఇంక ఆ పేటలో ఉండలేకపోయారు శాస్త్రిగారు. ఊరి చివర భారతీయ క్రైస్తవుల వాడలోకి మకాం మార్చారు.

అక్కడ అపరిశుభ్రత, ఆ వాతావరణం, పరిసరాలూ వారందరికీ వెగటు కలిగించాయి. కానీ తప్పదు. పైగా అందరి ఇళ్లలోనూ చేపలూ, మాంసం తినేవారు. అది వండుతుంటే వచ్చే వాసనకు కడుపులో త్రిప్పివేస్తుండేది అందరికీ.

శాస్త్రిగారు క్రైస్తవం పుచ్చుకున్న నాటినుండీ ఆ ఇంట్లో వారందరికీ శాంతిసౌఖ్యాలు శాశ్వతంగా దూరమయ్యాయి.

ఈ దుష్టపరిణామాలన్నీ ఊహించలేకపోయిన శాస్త్రిగారు మానసికంగా చాలా బాధపడడం మొదలుపెట్టారు. దానికితోడు- ఆయన తల్లి అదే దిగులుతో మంచం ఎక్కి చివరికి 'హరీ...' అంది. ఆమెను మోయడానికి కాని, కర్మ చేయించడానికి కాని ఎవరూ రాలేదు. చివరికి ఏ కర్మ లేకుండానే ఆవిడని తగులబెట్టవలసి వచ్చింది. క్రైస్తవ పద్ధతిలో ఆమెను పాతిపెట్టడానికి ఆయన మనస్సు ఒప్పలేదు.

శాస్త్రిగారు మతం మార్చుకున్నా ఆయన భార్య ముఖానికి కుంకుమ పెట్టుకునేది, మెళ్లో మంగళసూత్రం ఉండేది. ఇవి చూస్తే ఆ క్రైస్తవవాడలో జనానికి వింతగా ఉండేది. అందువల్ల ఆవిడని హేళన చేస్తుండేవారు. ఏమీ చేయలేక ఆవిడ చాలా బాధపడుతుండేది.

శాస్త్రిగారు ఏ ఆశలు భవిష్యత్తులో చూసుకొని మతం మార్చుకొన్నారో ఆ ఆశలు ఒక్కటొక్కటే అడియాసలు కాజొచ్చాయి. అంతవరకూ తనకి లభించినది ఇంగ్లీషు ప్రొఫెసర్ ప్రమోషనొక్కటే! తన పిల్లలను విదేశాలకు పంపుతానన్న జాన్సన్ 'ఇదుగో, అదుగో...' అంటూ దాటేయడం మొదలుపెట్టాడు ఆ విషయాన్ని. పైగా... వెనకటిలాగా ఆప్యాయంగా మాట్లాడడం కూడా మానేశాడు.

ఇదిలా ఉండగా జాన్సన్‌కి బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో మరొక ఆంగ్లేయుని నియమించారు. జాన్సన్ తర్వాత తనకి ప్రిన్సిపాల్‌గిరీ వస్తుందనుకొంటున్న శాస్త్రిగారికిది అశనిపాతమయింది. వెళ్లి జాన్సన్‌నే సూటిగా అడిగారు.

జాన్సన్– "నేనేం చేయను? నేను రికమెండ్ చేశాను. కానీ, వాళ్ళు ఏ పరిస్థితుల లోనూ ప్రిన్సిపాల్ పదవికి భారతీయుని నియమించడానికి ఇష్టపడలేదు. అయామ్ వెరీసారీ..." అని తప్పించుకున్నాడు.

శాస్త్రిగారికి తాను మోసపోయినట్లు రూఢి అయింది. చేసేది ఏమీలేక గది బయటకు వచ్చాడు. గుమ్మం దాటి ప్రక్కకు తిరిగేసరికి ప్రిన్సిపాల్ గదిలో తన పేరు వినిపిస్తుంటే అక్కడే ఆగిపోయారు. క్రొత్తగా వచ్చి ఛార్జీ పుచ్చుకుంటున్న ప్రిన్సిపాల్ –

"ఆ గలాటా ఏమిటీ?" అని జాన్సన్‌ని అడుగుతున్నాడు.

అందుకు జాన్సన్– "ఆయన అగ్రవర్ణానికి చెందిన హిందూ బ్రాహ్మణుడు. ఆయన క్రైస్తవ మతంలో కలిస్తే ఆయన్ననుసరించి చాలామంది మన మతంలో కలుస్తారనే ఉద్దేశంతో ఆయనకి చాలా ఆశలు చూపించి ఆయనకి బాప్టిజమ్ ఇప్పించాము. పూర్ మాన్... తనకి ఈ ప్రిన్సిపాల్ పదవి వస్తుందనే ఆశతో ఉన్నాడు. అది రాదని తెలిసి ఇలా హడావుడి చేస్తున్నాడు..." అని నవ్వుతూ చెప్పాడు.

విశ్వనాథశాస్త్రిగారి కళ్ళు చీకట్లు కమ్మాయి. ఇన్నాళ్లూ జాన్సన్ తనమీద చూపించింది వట్టి కపటప్రేమ అన్నమాట! వాళ్ళ స్వార్థం కోసం తనని చదరంగపు పావుగా ఉపయోగించుకున్నారు. తాను సర్వనాశనం అయ్యాడు. ఇంక ఆలోచించలేక పోయాడు. ఆవేశంతో పళ్లు కొరుకుతూ జాన్సన్ గదిలోకి వెళ్లి, "జాన్సన్! నీ మోసం తెలిసింది. నా పగ తీర్చుకుంటాను..." అని గట్టిగా అరచి, పట్టరాని ఆవేశంతో తిరిగి గది బయటకు వచ్చేశాడు.

ఇంటి కెళ్లేసరికి భార్య దుఃఖిస్తూ కనిపించింది. తన నుదుటి కుంకుమనూ, తన మెళ్లో మంగళసూత్రాన్నీ చూసి ఆ వాడకట్టు క్రైస్తవ స్త్రీలు హేళన చేస్తున్నారని చెప్పి చెంగు కళ్ళకడ్డం పెట్టుకుని ఏడవసాగింది. శాస్త్రిగారికి పవిత్ర హిందూధర్మాన్ని త్యజించిన తన దేహం కలుషితమైనదిగా అనిపించింది. ఆ పవిత్ర ధర్మానికి చిహ్నాలైన కుంకుమ, మంగళసూత్రాలు తనని పరిహసిస్తున్నట్లనిపించింది.

"నిజం! ఏనాడైతే నేను క్రైస్తవం పుచ్చుకున్నానో ఆనాడే చచ్చిపోయాను. నేను చచ్చిపోయాక నీ వంటిమీద అవి ఉంచరాదు. నన్ను కట్టుకున్న నువ్వు నాతోపాటు కిరస్తానీవయ్యావు. అలా చూసినా అవి నీ వంటిని ఉండదగవు!" అంటూ ఆవేశంతో భార్య మెడలో పుస్తెలు త్రెంపి, నుదుటి మీద కుంకుమ చెరిపేశారు శాస్త్రిగారు.

ఆయన ఉగ్రరూపం చూసి ఎవరూ మాట్లాడలేకపోయారు.

ఆయన భార్య అసలే మతంమార్పిడికి బాధపడుతోంది. ఆపైన తన భర్త తన చేతులతోనే తన పుస్తెలు త్రెంచి, కుంకుమ తుడిచివేయడం సహించలేకపోయింది. ఆ అవమానాన్ని భరించలేకపోయింది. అవి తననుండి దూరమయ్యాక తను జీవించడం వృధా అనుకుంది.

ఆ నిర్ణయంతో ఆ రాత్రి చెరువులో దూకి జీవితాన్ని అంతం చేసుకుంది.

అసలే దెబ్బమీద దెబ్బతింటున్న శాస్త్రిగారికి భార్యావియోగం భరించరానిదైంది. ఆవిడను కూడా కర్మ లేకుండానే తగులవేయవలసి వచ్చింది. ఈ కష్టాలన్నీ చేజేతులా తానే తెచ్చుకున్న బెంగతో ఆనాటి నుండీ స్కూల్‌కు వెళ్లడం కూడా మానుకున్నారు.

ఈ కష్టాలు చాలవన్నట్లు- జాన్సన్ ప్రోద్బలంపై స్కూల్‌వారు అధికారిని దూషించిన నేరానికి నోటిసు ఇచ్చి పనిలో నుండి తొలగించారు శాస్త్రిగారిని. అయితే ఆయనకు రావలసిన ప్రావిడెంటు ఫండు, వగైరాలు మాత్రం సకాలంలో అందజేశారు. కష్టాలతో బండబారిపోయిన శాస్త్రిగారిని ఆ చర్య ఏమీ చలింపజేయలేకపోయింది.

మిత్రులు చాలామంది శాస్త్రిగారికి- 'ప్రాయశ్చిత్తం చేసుకొని తిరిగి హిందూమతం పుచ్చుకోమనీ, లేదా ఆ ఊరు వదలిపెట్టి వేరే ఊళ్లో తిరిగి హిందువువలె జీవించమనీ' సలహాలు ఇచ్చారు.

"ఒకసారి మారాక- ఈ కలుషితమైన శరీరంతో తిరిగి హిందూధర్మ పవిత్రతని కలుషితం చేయలేను. తడవ తడవకీ మార్చుకోడానికి ఇదేమీ చొక్కా కాదు. ఈ జీవితం ఇలా వెళ్లిపోవలసిందే! నేను చేసిన పాపానికి, నా మూలంగా నన్ను నమ్ముకున్నవారికి కల్పించిన కష్టాలకు ప్రాయశ్చిత్తంగా ఇలాగే కుమిలిపోతూ ఈ జీవితం ఇలా వెళ్లిపోవలసిందే!' అన్నారు. ఆయన దృఢనిశ్చయాన్ని ఎవరూ మార్చలేకపోయారు.

నానాటికీ శాస్త్రిగారు మానసికంగానూ, దైహికంగానూ కూడా కృంగిపోజొచ్చారు. చివరికి ఆయనకి మతిచలించి ఒకనాటి రాత్రి ఎవ్వరికీ చెప్పకుండా ఇల్లువిడిచి వెళ్లిపోయారు. ఈనాటి వరకూ ఆయన ఏమైందీ ఎవరికీ తెలియదు. ఆయనను వెతకడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

శాస్త్రిగారికి ఉన్న పట్టుదలే ఆయన పిల్లలందరికీ సంక్రమించింది. వాళ్ళు కూడా మంచో, చెడో తాము తండ్రి చేసినదానికి తాము క్రైస్తవులుగానే ఉండిపోయారు. అయినా వారి మనస్సులో గౌరవం హిందూధర్మం మీదే ఉండేది. తమ తండ్రి భావించినట్లే వాళ్ళు కూడా తమ దేహం ఈ మతంమార్పిడి వల్ల కలుషితమైందని భావించారు. 'ఆ కలుషిత

దేహాల వల్ల వంశాభివృద్ధి జరిగి హిందూసంఘాన్ని కలుషితం చేయరాదు' అని నిశ్చయించుకున్నారు.

తమ తండ్రి చేసిన తప్పిదానికి తమ వంశం తమతోనే అంతరించిపోవాలని నిర్ణయించుకున్నారు. అందుకే ముగ్గురు మగపిల్లలూ, కూతురు కూడా శాశ్వతంగా బ్రహ్మచారులుగానే ఉండిపోవ నిశ్చయించారు... ఉండిపోయారు కూడా!

అందులోకి చిన్నవాడు చంద్రపాలశాస్త్రి! అందరిలోకీ అతను చాలా చురుకైనవాడు. క్రైస్తవులు అతనిని 'పాల్' అని పిలిచేవారు. చిన్నతనం నుండీ అతను పిలవబడ్డ పేరు 'శాస్త్రి.' అందువల్ల ఈ రెండూ కలిసి అతను 'పాల్‌శాస్త్రి' గా చలామణీ అయ్యాడు. తన తండ్రి చేసిన తప్పిదానికి అతను హిందూధర్మంలో గల ఉత్కృష్టతను పరిశోధించి లోకంలో ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకై అతను కష్టపడి సంస్కృతం నేర్చుకుని, వేదశాస్త్రాలన్నీ క్షుణ్ణంగా చదివి పదిహేను సంవత్సరాలు తీవ్రమైన కృషి చేశాడు.

ఆ విజ్ఞానాన్నుపయోగించి తన నలభైయ్యవ యేట హిందూవిజ్ఞానం గురించి 'పాల్‌శాస్త్రి' అనే పేరుతోనే పత్రికలలో అసంఖ్యాకంగా రచనలు చేస్తుండేవాడు.

'పాల్‌శాస్త్రి' అనే పేరునే అతను ఉంచుకోడానికి కారణం... ఆ పేరులో గల ప్రత్యేకత వల్ల పాఠకులు ఆసక్తితో తన విషాదచరిత్ర తెలుసుకుంటారనీ, ఆ విధంగా కొందరైనా తమవలె ఆహుతి కాకుండా ఆపవచ్చనీ భావించాడు.

పాల్‌శాస్త్రి అన్నలూ, అక్క కూడా మరణించారు. వాళ్ళకి ముఖ్యంగా జీవించాలనే కోరిక ఉండేది కాదు. యాంత్రికంగా జీవితం గడిపేసి, మానసికంగా మృత్యువును కోరుకుంటూ, 50 సంవత్సరాలు ఎవరికీ నిండకుండానే అందరూ మరణించారు. వారి మరణానికి పాల్‌శాస్త్రిగారు ఏమీ బాధపడలేదు. 'తాను కూడా ఎప్పుడు మరణిస్తానా...' అని ఎదురుచూడసాగాడు.

అతనికి స్వంతంగా ఒక టైపుమిషన్ ఉండేది. దానిమీద జాబ్‌వర్క్ చేసుకుంటూ ఆ సంపాదనతో జీవిస్తుండేవాడు. పత్రికలలో అయితే తన రచనలకు శాశ్వతత్వం ఉండదనే ఉద్దేశంతో అతను తన రచనలను గ్రంథరూపంలో తీసుకురావాలని నిశ్చయించుకున్నాడు. అందుకుగానూ 'పాల్‌శాస్త్రి ప్రచురణలు' అనే పేరుతో ఒక గ్రంథమాలను స్థాపించాడు.

తనకున్న దాంట్లోనే కొంత నిలవ చేయగలిగి, దాన్ని ప్రచురణలకు వినియోగించేవాడు. వాళ్ళ నాన్నగారి మీద నాకున్న గౌరవం కొద్దీ నేను కూడా అప్పుడప్పుడు అతనికి ఆర్థికసహాయం చేస్తుండేవాడిని.

'పాల్‌శాస్త్రి ప్రచురణలు' ప్రచారం పొంద మొదలుపెట్టాయి. అది గ్రహించారు మిషనరీలు. అతని పుస్తకాలన్నీ సోల్ డిస్ట్రిబ్యూషన్‌కి వాళ్ళే హక్కులు తీసుకుని మారుపేరుతో కొనివేయసాగారు. శాస్త్రిగారు తన పుస్తకాలు బాగా అమ్ముడుపోతున్నాయని సంతోషిస్తూండేవారు. మళ్లీ కొత్త పుస్తకాలు వేస్తుండేవారు. విచిత్రమేమిటంటే ఎప్పుడు అతని పుస్తకాలు మార్కెట్లో కనిపించడం కాని, ఎవరు చదివినట్లు కాని అతనికి వర్తమానం వచ్చేది కాదు. ఈ పరిస్థితి చూసి అతనికి ఆశ్చర్యం వేసి సంగతి ఏమిటా అని కూపీ తీశాడు.

తాను తెలుసుకున్నదానికి అతను విస్మయం చెంది కుప్పకూలినట్లు కూలిపోయాడు. అతని ప్రచారాన్ని అరికట్టే ఉద్దేశంతో; డబ్బు పుష్కలంగా ఉన్న మిషనరీలు- అతని అన్ని పుస్తకాలూ వాళ్ళే కొనేసి, వాటిని ఎవరికీ అందకుండా తగలబెడుతుండేవారు. అతని పుస్తకాలు చదివి ప్రజలు తిరిగి హిందూధర్మం వైపు మొగ్గుతారేమోననే భయంతో వాళ్ళు అలా చేయసాగారు.

పాల్‌శాస్త్రి తాను చేస్తున్న కృషి విఫలమయినట్లు గ్రహించాడు. పోనీ- వాళ్ళకి పుస్తకాలు అమ్మడం మానుకుందామంటే మరొక పది సంవత్సరాల వరకూ వాళ్ళతో ఒప్పందం ఉంది. దానిప్రకారం తాను ఈలోగా ఏ పుస్తకాలు ప్రచురించినా అన్నీ వాళ్ళకే అమ్మాలి. అంటే మరో పది సంవత్సరాల వరకూ తానేమీ చేయలేడు. తాను ఒంటరివాడు, వాళ్ళు డబ్బూ, హంగూ, అధికారం అన్నీ ఉన్నవాళ్ళు. వాళ్ళని ఎదిరించలేక చివరికి తన కృషినే మానుకున్నాడు. కానీ, అతను రచనలు చేసిన కొద్దికాలంలోనే ప్రసిద్ధ రచయితగా పేరుగాంచాడు. అయితే అతని రచనలలో ఎక్కువభాగం పత్రికలలోనే ఉండడం వల్ల ఇప్పుడెవ్వరికీ అతనిని గురించి తెలియదు.

సంవత్సరాలుగా తాను చేసిన కృషి విఫలమవడంతో పాల్‌శాస్త్రి మానసికంగా కృంగిపోయాడు. చివరికి తానేమీ చేయలేకపోయాననే బెంగతోనే పాల్‌శాస్త్రి తన 48వ ఏట కన్నుమూశాడు. ఆ విషయమై నాతో చాలాసార్లు వాపోయాడు. అయితే అతనికి ఒక కోరిక ఉండేది. తను మరణించాక తనకి హైందవ సాంప్రదాయ ప్రకారం దహన సంస్కారాలు చేయించాలని! ఆ భారం నాపైన పెట్టాడు. నేను ఆ మాట అతనికి ఇచ్చాననే తృప్తితో కన్నుమూశాడు.

క్రైస్తవుడైన అతనికి హైందవ పద్ధతిలో దహన సంస్కారాలు చేయడం పెద్ద సమస్య అయింది. చివరికి నేను అతని తండ్రి క్రైస్తవుడయ్యాడు కాని- అతను కాలేదనీ, పాల్‌శాస్త్రి

తన తండ్రి హిందువుగా ఉండగానే పుట్టాడు కనుక అతను హిందువే అవుతాడని వాదించి ఎలాగైతేనేం- కర్మ చేయవలసిన దూరపు బంధువునీ, చేయించే బ్రాహ్మణుడినీ ఒప్పించగల్గాను. ఇదీ నాయనా... విశ్వనాథశాస్త్రిగారి కుటుంబపు విషాదగాథ!

విశ్వనాథశాస్త్రిగారినీ, ఆయన కుటుంబాన్నీ, క్రైస్తవ మతం పుచ్చుకున్నందుకు ఈ హైందవ సంఘం విమర్శించిందే గాని, వారు చేసిన త్యాగాన్ని గుర్తించగలిగిందా?

మనిషన్నవాడు తప్పు చేయకపోడు. ఒకసారి చేసిన తప్పుకు మొత్తం కుటుంబమే స్వచ్ఛందంగా పూర్ణాహుతి చేసుకున్నారే?! ప్రాపంచిక సుఖాలనన్నిటినీ వారు పరిత్యజించారే?! అంతటి కఠోరదీక్ష ఎవరు పూనగలరు? కేవలం ప్రాయశ్చిత్తంతో తిరిగి హిందూమతంలోకి రాగలిగిన అవకాశం ఉన్నా తడవతడవకూ మతం మార్చడం సహేతుకం కాదనే విశ్వాసంతో కోరి కష్టాలు తెచ్చుకోగలిగిన మనోనిబ్బరం ఎందరికి ఉంటుంది?

పాల్‌శాస్త్రి గ్రంథాలను మిషనరీలు నాశనం చేస్తుంటే ఈ సంఘం ఏమి చేయగలిగింది? అతనికి బాసటయై నిలువగలిగిందా? మనలో ఇన్ని లోపాలు ఉన్నాయి కాబట్టే మనం ఇలా సర్వనాశనమయిపోతున్నాం!"

- భారంగా నిట్టూర్చి ముగించాడు రామశర్మగారు.

నా మనస్సు పరితాపంతో నిండిపోయింది.

"మన చుట్టూనే ఎన్ని ఘోరాలు జరుగుతున్నాయి..?!" అన్నాను సాలోచనగా.

"బాబూ! దహనసంస్కారం పూర్తయింది... మీరు స్నానాలు ముగించండి!"

- అంటూ బ్రాహ్మణుడు వచ్చాడు.

ఇద్దరం లేచి స్నానాలు ముగించాము. దారిపొడుగునా తులసి మొక్కలు ఉన్నాయి. కాసిని తులసి మొక్కలు కోసి భక్తితో పాల్‌శాస్త్రిగారిని దహనం చేసినచోట ఉంచి, భారంగా వెనుదిరిగాను. రామశర్మగారు కూడా తులసిదళాలు ఉంచారు.

మరొక్కసారి పాల్‌శాస్త్రిగారిని దహనం చేసిన వైపు చూసి, భారంగా అడుగులు వేస్తూ ముందుకు సాగాను.

రామశర్మగారు కూడా మౌనంగా నా వెనకాలే బయలుదేరారు.

'కృష్ణా పత్రిక' . . . ఫిబ్రవరి, 1996